ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 30 సెప్టెంబరు 2024



విశాఖలో లులు మాల్!

తాజాగా సీఎం చంద్రబాబుతో సంస్థ అధినేత భేటీ

- నిర్మాణంపై చిగురిస్తున్న ఆశలు
- ప్రస్తుతం 13.83 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

- 7లో

- సుమారు 15 వేల మందికి ఉపాధి లభించే అవకాశం

రైతన్నకు తప్పని నిరీక్షణ



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురుచూపులు

- దరఖాస్తు చేసి మూడు నెలలవుతున్నా రాని అనుమతి
- ఈపీడీసీఎల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంపై ఆగ్రహం



చోడవరం, సెప్టెంబరు 29: గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు సంబంధించి 100 మందికి పైగా దరఖాస్తు చేశారు. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎప్పుడు వస్తాయా? అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తు చేసిన వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని ఈపీడీసీఎల్ అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒక పక్క ఖరీఫ్ సీజన్ నడుస్తున్నప్పటికీ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు ఈపీడీసీఎల్ అధికారులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో రైతులకు అన్యాయం జరగకుండా మార్పులు చేసింది. దీనిలో భాగంగా గతంలో మాదిరిగా రైతులు ఈపీడీసీఎల్ కాల్‌సెంటర్ లేదా మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకొనే అవసరం లేకుండా రైతులే నేరుగా ఆన్‌లైన్‌లో 1912లోకి లాగిన్ అయి సొంతంగా దరఖాస్తులు చే సుకునే వీలు కల్పించింది. దళారులు, ఇతరుల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లో రైతుల పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, ఫొటో, బోరు ఉన్నట్టుగా తహసీల్దార్ నిర్ధారించిన ఫారం త్రీ సర్టిఫికెట్‌తో పాటు జియాలజిస్ట్ రిపోర్టును రైతులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రైతుల వివరాలు సంబంధిత ఈపీడీసీఎల్ అధికారులకు చేరిన వెంటనే అధికారులు ఆ రైతు పొలాన్ని సందర్శించి అతనికి విద్యుత్ కనెక్షన్‌కు అవసరమైన మెటీరియల్ ఎంత పడుతుందో అంచనా వేస్తారు. ఇందులో ప్రభుత్వం రైతుకు ఇచ్చే సబ్సిడీ వివరాలు మినహాయించిన తరువాత ఆ రైతు సంస్థకు ఎంత రుసుము చెల్లించాలనే వివరాలు సంబంధిత రైతుకు ఆన్‌లైన్‌లో చేరతాయి. ఆ రుసుము రైతు చెల్లించిన మీదట సిబ్బంది సంబంధిత రైతు పొలంలో మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. ఇందులో రైతులు ఎక్కడా దోపిడీకి గురికాకుండా ఉండేలా ప్రభుత్వం కొత్త పద్ధతికి రూపకల్పన చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఈ కొత్త విధానంలో దరఖాస్తు చేసిన రైతులకు మూడు నెలలవుతున్నా ఇప్పటికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరుకాలేదు. దీంతో అన్నదాతలు ఈపీడీసీఎల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో స్పష్టంగా స్థానిక ఏఈలు, సిబ్బంది చెప్పకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ఖరీఫ్ సీజన్ నడుస్తున్న సమయంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి ఉంటే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, అది లేకపోవడంతో ఇంజన్ మోటార్ల ద్వారా పంటలకు నీరు తడుపులు ఇచ్చుకోవలసి వస్తున్నదని అన్నదాతలు వాపోతున్నారు.

అనుమతుల కోసం ఎదురుచూపులు

మండలాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసిన రైతులకు సంబంధించి ఎస్టిమేషన్లను ఈపీడీసీఎల్ అధికారులు పూర్తి చేసినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు సంబంధించి 100 మందికి పైగా రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా చాలా మంది రైతులు దరఖాస్తు చేశారు. వీరంతా విద్యుత్ కనెక్షన్లు ఎప్పుడు వస్తాయా? అని ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాలి

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు కోసం ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావలసి ఉంది. కొత్తగా కనెక్షన్ కావలసిన రైతులు తమ వివరాలను నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియకు ఎలాంటి అనుమతి అవసరం లేదు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సంబంధించిన ఎస్టిమేషన్లను సిబ్బంది ఇప్పటికే పూర్తి చేశారు. అనుమతి వచ్చిన తరువాత రైతులకు కనెక్షన్లు ఇస్తాం.

- ఎ.రామకృష్ణ, ఈపీడీసీఎల్ డీఈ, నర్సీపట్నం


విశాఖకు జియో పార్కు హోదా?

దేశంలో ఆరు ప్రాంతాలను గుర్తించిన జీఎస్ఐ

- విశాఖపట్నం అర్బన్‌కు చోటు
- ఇటీవల ఢిల్లీలో జరిగిన సదస్సులో చర్చ
- త్వరలో యునెస్కోకు ప్రతిపాదనలు
- జిల్లాలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధారామాలు, బొర్రా గుహలు, తూర్పు కనుమలకు చారిత్రక ప్రాశస్త్యం
- జియో గుర్తింపు వస్తే భారీ ప్రయోజనాలు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

విశాఖకు జియో పార్కుగా గుర్తింపు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాల్లోని 200 ప్రాంతాలను యునెస్కో జియో పార్కులుగా గుర్తించింది. మన దేశంలో ఆరు ప్రదేశాలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) గుర్తించింది. ఇందులో విశాఖపట్నం అర్బన్ ఒకటి. ఇటీవల ఢిల్లీలో యునెస్కో- జీఎస్ఐ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో జియో పార్కులపై చర్చించారు.



దేశంలో జబల్‌పూర్ జియోపార్కు, సిక్కిం మామెలిలో ఫోషిల్ పార్కు, కేరళ వరకల జియోపార్కు, రాజస్థాన్‌లో రామగర్ జియోపార్కు, లద్దాఖ్‌లో లామయూరు మ్యూజియం, విశాఖపట్నం అర్బన్ జియో పార్కులపై ఈ సదస్సులో చర్చించారు. వాటికి గుర్తింపు లభించేలా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం చొరవ తీసుకోవాలని సమావేశం కోరింది. ప్రతి ఏటా ఒక దేశానికి చెందిన రెండు ప్రదేశాలకు మాత్రమే యునెస్కో గుర్తింపునిస్తుంది. ఇదిలావుండగా ఢిల్లీ సదస్సులో ప్రతిపాదించిన ఆరు ప్రదేశాలలో విశాఖకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఇంటాక్ (నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) అనే సంస్థ ప్రతిపాదించింది. జియోపార్కుగా గుర్తింపు లభిస్తే ఈ ప్రాంతంలో ఉన్న అన్ని ప్రముఖ స్థలాలను ఒకే గొడుగు కిందకు వస్తాయి. ఒక అథారిటీ ఏర్పాటుచేసి కార్యకలాపాల నిర్వహణకు వీలుంటుంది. విశాఖపట్నం 1.7 బిలియన్ సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన భౌగోళిక వైవిధ్యం గల ప్రాంతం. ఇక్కడ ఎర్రమట్టిదిబ్బలు, బొర్రా గుహలు, బౌద్ధారామాలైన తొట్లకొండ, బావికొండ, బొజ్జన్నకొండ తదితర పర్యాటక ప్రదేశాలకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. విశాఖ సముద్రతీరం నుంచి వేల సంవత్సరాల క్రితమే పలు దేశాలతో నౌకా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆగ్నేసియా దేశాలకు బౌద్ధమతం వ్యాపించింది.

భౌగోళిక స్థలాలకు గుర్తింపు

భీమిలి సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ స్థలాన్ని భౌగోళిక వారసత్వ సంపదగా జియోజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. సుమారు 18,500 సంవత్సరాలలో పాలియో క్లైమేట్, సముద్ర మట్టాలలో మార్పులు, రుతుపవనాల ఆగమనం వంటి కారణాలతో ఎర్రమట్టిదిబ్బలు ఏర్పడ్డాయి. బొర్రాగుహలు కూడా వేల సంవత్సరాల క్రితం నాటివే. వీటితో పాటు సింహాచలం దేవాలయం, పాత నగరంలో వారసత్వ కట్టడాలు జియోపార్కు ఏర్పాటులో కీలకపాత్ర పోషించనున్నాయి. పురాతన చరిత్ర గల ఈ ప్రదేశాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి జియోపార్కుగా గుర్తింపు వస్తే ఈ ప్రాంతానికి అంతర్జాతీయంగా ఎంతో ప్రాధాన్యత లభిస్తుంది. కాగా జియోపార్కుగా విశాఖపట్నం అర్బన్‌ను గుర్తించాలంటే యునెస్కో నిర్దేశించిన నమూనా సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఎర్రమట్టిదిబ్బలను భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించేందుకు విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటాక్ సంస్థ కృషి చేసింది. ఈ సంస్థ ప్రస్తుత విశాఖ చాప్టర్ ఛైర్మన్, ఏయూ జియాలజీ విశ్రాంత ఆచార్యులు రాజశేఖరరెడ్డి, తదితరులు జీఎస్ఐతో పోరాడి గుర్తింపు తీసుకువచ్చారు. విశాఖపట్నం పరిసరాల్లో మరికొన్ని పురాతన ప్రదేశాలను ప్రపంచానికి చాటి చెప్పాలని ఇంటాక్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన సదస్సులో జియోపార్కులపై నివేదిక సమర్పించారు.

ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుంది

విశాఖపట్నం అర్బన్‌ను జియోపార్కుగా యునెస్కో గుర్తిస్తే ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభిస్తుంది. దీని వల్ల ఇతర దేశాల నుంచి ఎక్కువమంది పర్యాటకులు వస్తారు. ఒకసారి ప్రపంచ వ్యాప్త పర్యాటకులు సందర్శిస్తే ఈ ప్రాంతం భౌగోళిక వారసత్వ సంపద, పురావస్తు చరిత్ర, విశిష్టతకు ప్రాచుర్యం లభిస్తుంది. ఇక్కడి ప్రజల జీవన విధానం, సాంస్కృతిక, వారసత్వ సంపద, ఆహారం, వస్తువులు, వాతావరణం, దర్శనీయ స్థలాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. దీంతో పెద్దఎత్తున ఉపాధితో పాటు ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి.

- డాక్టర్ డి.రాజశేఖరరెడ్డి, సలహాదారు, జియో హెరిటేజ్‌సెల్, ఇంటాక్ కన్వీనర్

బాగుపడే మార్గం లేదా?

పైపులైన్ల ఏర్పాటు కోసం రహదారులను తవ్వేసిన జీవీఎంసీ

- పనులు పూర్తయిన తరువాత మట్టితో కప్పి వదిలేసిన వైనం
- రోడ్లు ఛిద్రం కావడంతో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



జగన్నాథస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో తవ్వి వదిలేసిన దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29: స్థానిక గవరపాలెంలోని పలు వీధుల్లో జీవీఎంసీ అధికారులు పైపులైన్ల ఏర్పాటు కోసం గోతులు తవ్వి వదిలేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం పైపులైన్ల ఏర్పాటుకు రహదారుల్లో కొంత భాగాన్ని తవ్వి పనులు పూర్తయిన తరువాత మట్టితో కప్పి వదిలేశారు. దీంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.

గవరపాలెంలోని నిదానందొడ్డి, సంతోషిమాత ఆలయం రోడ్డు, దిబ్బవీధి, జగన్నాథస్వామి కోవెల వరకు జీవీఎంసీ అధికారులు తాగునీటి పైపులైన్ల ఏర్పాటు కోసం రహదారులను తవ్వారు. అసలే ఇరుకు రోడ్లు కావడం, పైగా తవ్వకాలు జరపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్లను తవ్వి పనులు పూర్తయిన తరువాత మట్టితో కప్పి వదిలేశారే తప్ప సిమెంట్ ప్లాస్టింగ్ పనులు చేపట్టలేదు. దీనికి తోడు పలుచోట్ల కల్వర్టులు ఉన్న ప్రదేశంలో రహదారి మరింత దెబ్బతినడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. దీని వల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గవరపాలెంలోని ఏ వీధికి వెళ్లాలన్నా ప్రధాన రహదారి ఇదే కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. దీనిపై జీవీఎంసీ అధికారులకు పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే రహదారులను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అధికారులను వివరణ కోరగా పైపులైన్ల లీకేజీలపై పునఃపరిశీలన చేసిన తరువాత సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు.

సముద్రంలో మరబోటు దగ్ధం

- సురక్షితంగా బయటపడిన ఏడుగురు మత్స్యకారులు
- పూడిమడక వద్ద సంఘటన



పూడిమడక సముద్ర తీరంలో కాలిపోతున్న మరబోటు

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపలవేటకు బయలుదేరిన మెకనైజ్డ్ (మర) బోటు ఆదివారం అచ్యుతాపురం మండలం పూడిమడక పరిధిలో ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతయింది. ఇందులోని ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ఈదుకుంటూ తీరానికి చేరుకున్నారు.

- వార్త మెయిన్‌లో..

మత్స్యకారులు డీలా

నిరాశపరిచిన చేపల వేట

- ఎనిమిది రోజుల తరువాత వేటకు వెళితే వలలకు చిక్కిన చిన్న చేపలు
- కొనేవారు లేక తీరంలో పడేసిన వైనం
- శ్రమకుతగ్గ ఫలితం రాలేదని ఆవేదన



వల నుంచి చిన్న చేపలను తీస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 29: సముద్రంలో ఆదివారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. ఎంతో కష్టపడి వేట సాగించినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఎక్కువగా బాగా చిన్న చేపలు వలలో పడడంతో వాటిని ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో తీరంలోనే పడేశారు.

అల్పపీడన ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో ఈ నెల 21 నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. శనివారం రాత్రి సముద్రం శాంతించడంతో ఆదివారం వేకువ జామున సుమారు 150 పడవలతో చేపల వేటకు బయలుదేరారు. జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో సుమారు ఏడు వందలకు పైగా చిన్న, పెద్ద బోట్లున్నాయి. చిన్న పడవలు గల మత్స్యకారులు వలలతో సముద్రంలో దగ్గర దూరం వేటకు వెళతారు. ఒక పడవలో ఆరుగురు వేటకు వెళితే సాధారణ రోజుల్లో రూ.6 వేలకు తక్కువ కాకుండా విలువైన చేపలను తెచ్చుకుంటారు. అయితే ఆదివారం వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు ఎందుకూ పనికి రాని కారలు, కదురు చేపలు చిక్కాయి. చిన్న చేపలను ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో తీరంలో పడేశారు. కొంత మంది మత్స్యకారులకు అతి తక్కువ కదురు చేపలు చిక్కాయి. గతంలో ఈ చేపలు పనం (20 పుంజీలు లేదా 80 చేపలు) రూ.3500ల ధర పలికేవి. అయితే ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో పనం చేపలు రూ 2200లకు కొనుగోలు చేశారు. పనం చేపలకు రెండు పుంజీలు (ఎనిమిది చేపలు) అదనంగా ఇవ్వాలన్న నిబంధన ఉంది. ఈ విధంగానే ఆదివారం ఇక్కడ చేపలు విక్రయించారు. కష్టపడి చేపల వేట సాగించినా కూలి డబ్బులు కూడా రాలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.



కొనేవారు లేక తీరంలో చిన్న చేపలను వదిలేసిన దృశ్యం

జలాశయాలకు పోటెత్తిన వరద నీరు



రైవాడ జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

- రైవాడ జలాశయం నుంచి 2,500, కోనాం జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

దేవరాపల్లి, సెప్టెంబరు 29: మండలంలోని రైవాడ జలాశయం, చీడికాడ మండలంలోని కోనాం జలాశయాలకు వరదనీరు పోటెత్తింది. జలాశయాల్లో నీటిమట్టాలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఆదివారం గేట్లు ఎత్తి నీరును దిగువకు విడుదల చేశారు.

మండలంలోని రైవాడ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో రెండు రెగ్యులేటింగ్ గేట్లు ద్వారా 2,500 క్యూసెక్కుల వరద నీటిని శారదా నదిలోకి విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, శనివారం 113.50 మీటర్లుగా నమోదైంది. ఆదివారం ఉదయం జలాశయంలోకి 1,800 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో ఒక రెగ్యులేటింగ్ గేటు ద్వారా వరద నీటిని విడుదల చేశారు. సాయంత్రం జలాశయంలోకి 2,500 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండడంతో రెండు గేట్లు ద్వారా 2,500 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. జలాశయంలోకి వచ్చిన వరద నీరును ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నామని, జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని డీఈఈ సత్యనాయుడు తెలిపారు.



కోనాం జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

కోనాం జలాశయం నుంచి..

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం 100 మీటర్లకు చేరడంతో ఆదివారం సాయంత్రం 300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 100 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 100 క్యూసెక్కులు కాగా, ఎగువ, దిగువ కాలువల ద్వారా 300 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేశామని ఏఈ జయరాంపడాల్ తెలిపారు.

క్రైం... crime news

బీఆర్టీ కాలనీలో యువకుడి ఆత్మహత్య


శ్రీనివాసరావు మృతదేహం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కె.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలివి. ఇక్కడి బీఆర్టీ కాలనీలో నివాసం ఉంటున్న ప్రకాశం జిల్లా పామర్రు మండలం పుట్టనాయుడుపల్లి గ్రామానికి చెందిన రాయవరపు శ్రీనివాసరావు (34)కు తొమ్మిదేళ్ల క్రితం అతని స్వగ్రామంలో వివాహమైంది. వివిధ కారణాల వల్ల భార్యభర్త ఆరు నెలల వ్యవధిలోనే విడిపోయారు. అనకాపల్లిలోని బీఆర్టీ కాలనీలో నివాసముంటున్న తన అక్క గుత్తా రామలక్ష్మి ఇంటి వద్దే కొన్నేళ్లుగా అక్క భర్త చనిపోవడంతో ఆమెకు తోడుగా శ్రీనివాసరావు ఉంటున్నాడు. పదిహేను రోజుల క్రితం అక్క రామలక్ష్మి స్వగ్రామం పుట్టనాయుడుపల్లిలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న శ్రీనివాసరావు మానసిక వేదనతో శనివారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. ఇది గుర్తించిన స్థానికులు వెంటనే అతనిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా అక్కడ మృతిచెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. మృతుని అక్క రామలక్ష్మి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతలూరు టేకు తోటల్లో వ్యక్తి అనుమానాస్పద మృతి

చింతపల్లి, సెప్టెంబరు 29: మండలంలోని పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామ సమీప టేకు తోటల్లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని స్థానిక ఎస్‌ఐ అరుణ్ కిరణ్ ఆదివారం తెలిపారు. టేకుతోటల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన వ్యక్తి 35 నుంచి 40ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మృతుడుకి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా 944904239, 9440904238 నంబర్లకు కాల్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విశాఖలో లులు మాల్!

- తాజాగా సీఎం చంద్రబాబుతో సంస్థ అధినేత భేటీ
- నిర్మాణంపై చిగురిస్తున్న ఆశలు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒప్పందం
- రూ.2,200 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదన
- గత వైసీపీ ప్రభుత్వ చర్యలతో పారిపోయిన దిగ్గజ సంస్థ
- కూటమి ప్రభుత్వం వచ్చాక కదలిక
- ప్రస్తుతం 13.83 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు


లులు మాల్ నిర్మాణానికి నగరంలో కేటాయించిన స్థలం

విశాఖపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖలో లులు మాల్ నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో శనివారం లులు గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ భేటీ కావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో గతంలో కుదుర్చుకున్న ఒప్పందం పునరుద్ధరిస్తారని, ఇందులో భాగంగా మాల్ నిర్మాణానికి చర్యలు వేగవంతమవుతాయని భావిస్తున్నారు. రూ.వేల కోట్లతో మాల్ నిర్మాణం పూర్తయితే సుమారు 15 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు.

టీడీపీ అధికారంలో ఉండగా 2018లో విశాఖ బీచ్‌రోడ్డులోని 13.83 ఎకరాల్లో భారీ మాల్ నిర్మాణానికి లులు సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం ఏపీఐఐసీకి చెందిన 11.23 ఎకరాలు, సీఎంఆర్ గ్రూప్‌నకు చెందిన విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఉన్న ప్రాంతం 2.60 ఎకరాలు వెరసి 13.83 ఎకరాల్లో మాల్, కన్వెన్షన్ సెంటర్, ఇతర వ్యాపార సంస్థల ఏర్పాటుకు అప్పట్లో రూ.2,200 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు లులు సంస్థ ప్రతిపాదించింది. మాల్ నిర్మాణంతో సుమారు పది వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. ఇందుకు ఏపీఐఐసీ స్థలానికి ఆనుకుని ఉన్న విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌ను ఇచ్చేలా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణను అప్పటి సీఎం చంద్రబాబు ఒప్పించారు. ఈ స్థలానికి బదులుగా నగరంలో కొన్నిచోట్ల సీఎంఆర్‌కు ప్రభుత్వ స్థలాలను బదలాయించారు. దీంతో మాల్ ఏర్పాటుకు డిజైన్లు రూపొందించి, శంకుస్థాపన ప్రక్రియను కూడా పూర్తిచేశారు.

వైసీపీ నిర్ణయాలతో వెనక్కి

2019 ఎన్నికల్లో వైసీపీ గెలిచి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఒక్కసారిగా కథ మారిపోయింది. లులు మాల్‌కు భూకేటాయింపుల్లో అవకతవకలు జరిగాయనే నెపంతో రివర్స్ టెండరింగ్ పేరిట టీడీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని అడ్డగోలుగా రద్దుచేశారు. దీంతో లులు గ్రూప్ రాష్ట్రం నుంచి తరలిపోయింది. తమిళనాడు, తెలంగాణ, కేరళలో భారీ మాల్స్ ఏర్పాటుచేసింది. అయితే విశాఖలో మాల్ నిర్మాణానికి కేటాయించిన భూమి ఇప్పటికీ ఖాళీగానే ఉంది. అందులో భారీ షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మించడానికి ఆసక్తి గల సంస్థలు ముందుకు రావాలని గత వైసీపీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు నిర్మించి, అడుగు రూ.6,500 చొప్పున విక్రయించి, ప్రభుత్వానికి జమ చేయాలని పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదనకు కనీస స్పందన లభించలేదు. ఈ నేపథ్యంలో లులు మాల్‌కు కేటాయించిన స్థలంతో పాటు గాజువాక సమాపాన ఉన్న అగనంపూడి, ఫకీర్‌తకియాల్లో మూడు ఎకరాలు కలిపి మొత్తం రూ.1,465 కోట్లకు భూములను అమ్మకానికి పెట్టింది. ఇందులో బీచ్ రోడ్డులోని 13.83 ఎకరాలకు రూ.1,452 కోట్లుగా విలువ నిర్ణయించింది.

ముందుకు రాని సంస్థలు

వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతో పెట్టుబడిదారులు ముందుకు రాకపోవడంతో భూముల అమ్మకానికి కూడా స్పందన లభించలేదు. రాష్ట్రంలో తిరిగి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లులు సంస్థ ఏర్పాటుకు కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం సంస్థ చైర్మన్ ముఖ్యమంత్రిని కలిసి చర్చించడంతో మాల్ ఏర్పాటుకు ప్రతిపాదించారని సమాచారం. ఐదేళ్ల క్రితం చేసుకున్న ప్రతిపాదనలను ప్రభుత్వం పునరుద్ధరించే అవకాశం ఉన్నందున పెట్టుబడుల విలువ పెరిగే అవకాశం ఉంటుందని కూడా భావిస్తున్నారు.

15 వేల మందికి ఉపాధి

విశాఖలో లులు మాల్ ఏర్పాటైతే సుమారు 15 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఐదువేల సీటింగ్ సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్, సుమారు ఎనిమిది మల్టీప్లెక్స్ థియేటర్లు, హైపర్ మార్కెట్, ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌తో పాటు ఇతర వసతులు కల్పించేలా మాల్ నిర్మాణం చేపడతారని సమాచారం. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులు త్వరలో విశాఖ వచ్చే అవకాశం ఉంది. ఆ తరువాత గతంలో రద్దయిన ఒప్పందం పునరుద్ధరణ, తదితర అంశాలపై చర్యలు వేగవంతం కానున్నాయని తెలిసింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

రోడ్లు ఛిద్రం...

- వర్షాల దెబ్బకు అధ్వానంగా రహదారులు
- నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో కుంగిన కల్వర్టు
- స్పీకర్ ఇంటి ముందు దారుణంగా బీటీ రోడ్డు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు


బలిఘట్టంలోని మెయిన్ రోడ్డు

నర్సీపట్నం, సెప్టెంబరు 29: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో ఎక్సైజ్ కార్యాలయం దాటిన తర్వాత రెండు చోట్ల రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, అంబేడ్కర్ గురుకులం, కోర్టు సముదాయం, కూరగాయల మార్కెట్ ఉన్నాయి. చింతపల్లి వైపు వెళ్లే బస్సులు, ఏజెన్సీ సంతకు వెళ్లే వాహనాలు ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగించాలి.


నర్సీపట్నం-కృష్ణాదేవిపేట మార్గంలో స్పీకర్ ఇంటి సమీపంలో పాడైన రోడ్డు


నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో కుంగిన కల్వర్టు

గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి శ్రీకన్య కూడలిలో గుంతల కారణంగా ఇద్దరు ముగ్గురు వాహనదారులు పడిపోయారు. శారదానగర్ రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ ముందు పెద్ద గొయ్యి పడింది. మునిసిపల్ కమిషనర్, సీఐ రేవతమ్మ మట్టితో గొయ్యి పూడ్చివేతకు చర్యలు తీసుకున్నారు. నర్సీపట్నం-తుని రోడ్డు, బలిఘట్టం ఊరులో తారు రోడ్డు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నర్సీపట్నం-కృష్ణాదేవిపేట రోడ్డులో కల్వర్టు కుంగిపోయింది.

ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఇంటి ముందే రోడ్డు పాడై ఉన్నప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పీకర్‌ను కలిసేందుకు జిల్లా నలుమూలల నుంచి పలువురు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వస్తుంటారు. ఈ ఇంటి సమీపంలోని రోడ్డు దారుణంగా ఉన్నా పట్టించుకోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారి మూడు నెలలు దాటినా అధికారుల తీరు మారలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

- మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

చోడవరం, సెప్టెంబరు 29: ఎస్సీల వర్గీకరణతో దేశంలో దళితులను అణగదొక్కడంతో పా టు, రాజ్యాంగాన్ని కూలదోసేందుకు చేస్తున్న కుట్రలపై పోరాటం సాగిస్తామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన మాలల చైతన్య సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌ల పేరుతో దళితులను విడదీసి దెబ్బతీసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. అంబేడ్కర్ కల్పించిన దళితుల రిజర్వేషన్లకు చిచ్చు పెట్టాలని నేతలు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. ఈ స్థితిలో భావితరాలకు జరగనున్న అన్యాయాన్ని గుర్తించి ప్రతి దళితుడూ ఎస్సీల వర్గీకరణతో పాటు, క్రీమిలేయర్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహాసభ నాయకులు మల్లెల వెంకటరావు, అన్నవరపు కిశోర్, మంచ నాగమల్లేశ్వరి, బేతాళ సుదర్శనం, చిట్టిబాబులతో పాటు, అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా నాయకులు డెంకాడ పెంటారావు, ఎం. అప్పారావు, చినదేముడు, నేతల భోగేశ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎస్సీల వర్గీకణకు వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలోపలువురు దళితనాయకులు, ఇతర నేతలు పాల్గొన్నారు.


వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ హర్షకుమార్

పరిహారం పంపిణీలో తీవ్ర అన్యాయం

- అధికారులు చట్టాలను ఉల్లంఘిస్తున్నారు
- చందనాడలో కారిడార్ నిర్వాసిత రైతుల ఆవేదన

నక్కపల్లి, సెప్టెంబరు 29: విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు అధికారులు అన్యాయం చేస్తున్నారని, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ కారిడార్ నిర్వాసిత రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని చందనాడ గ్రామంలో తొలుత నిర్వాసిత రైతులంతా సమావేశమయ్యారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా, న్యాయస్థానాల తీర్పులను పట్టించుకోకుండా అధికారులు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఏరకమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో కూడా ఇప్పటి వరకూ చెప్పడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో చందనాడ సర్పంచ్ తళ్లా రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, తళ్లా అప్పలస్వామి, గోవింద్, బాబ్జీ, నర్సింగరావు, రాజేశ్, కృష్ణ, నూకరాజు, అప్పలరాజు, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.


చందనాడలో ఆందోళన చేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు

వైద్య విద్యను ప్రైవేటు పరం చేయొద్దు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటుపరం చేయవద్దంటూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. అనకాపల్లిలో జరుగుతున్న ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహా సభలో రెండురోజు ఆదివారం వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ లేకపోవడం విద్యను నిర్వీర్యం చేయడమేనన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ సభలో బాలేపల్లి వెంకటరమణ షేక్ మస్తాన్, నాగభూషణం, రాజాన దొరబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్‌లతో పాటు 31మందిని కమిటీ సభ్యులుగా, తొమ్మిది మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో స్వచ్ఛత హీ సేవ


తీరంలో క్లీనింగ్ పనులు చేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ, సెప్టెంబరు 29 : మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రిలయెన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కూండ్రపు మధు, అర్జిల్లి రవితో పాటు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో అనకాపల్లి లాయర్ల ప్రతిభ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనకాపల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదులు అద్భుత ప్రతిభ చూపారు. శని, ఆదివారాల్లో షటిల్, క్యారమ్స్, చెస్ పోటీలు జరగ్గా, అనకాపల్లి నుంచి షటిల్‌లో న్యాయవాది రోమాల అప్పలనాయుడు, క్యారమ్స్‌లో న్యాయవాది ఒమ్మి గంగాధర్ రన్నర్లుగా నిలిచారు. ఆడారి స్వామి, శరత్‌లు అత్యుత్తమ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విజేతలను అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు తదితరులు అభినందించారు.


బహుమతులు అందుకుంటున్న న్యాయవాదులు

గిరిజన ప్రాంత విద్యా సంస్థల్లోని సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్

పాడేరురూరల్, సెప్టెంబరు 29: గిరిజన ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అల్లూరి జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో ఉన్న అనేక సమస్యలతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గిరిజన విద్యార్థుల సమస్యలపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గిరిజన విద్యార్థులకు వసతిగృహాల్లో సరైన పౌష్టికాహారం అందక మృత్యువాత పడుతున్నారన్నారు. గిరిజన పాఠశాల, కళాశాల వసతిగృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, మెడికల్ శిబిరాలను నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎగ్జామ్, ట్యూషన్ ఫీజులు ఐటీడీఏ చెల్లించాలని, ఆశ్రమ పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.జీవన్‌కృష్ణ, పి.చిన్నారావు, పి.సింహాద్రి, పి.అన్నబాబు, జ్యోతి, కాంచుల, ప్రసాద్, దిలీప్, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

అధ్వానంగా తాండవ రోడ్డు

- గోతుల్లో చేరిన వర్షపు నీరు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- రాకపోకలకు ఇబ్బంది
- వాహనదారుల అవస్థలు


తాండవ రోడ్డు గోతుల్లో నిండిన వర్షం నీరు

నాతవరం, సెప్టెంబరు 29: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలో ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రోడ్లు పాడయ్యాయి. ఇటీవల వర్షాలకు మరింతగా ఇబ్బందిగా మారాయి. వర్షం వస్తే చాలు నీరు చేరి చెరువులకు తలపిస్తున్నాయి. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు వర్షాలకు బాగా దెబ్బతింది. కనీసం గోతులు కూడా పూడ్చివేతకు చర్యలు తీసుకోకపోవడంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. అలాగే తాండవ రోడ్డు గోతులమయంగా తయారవడంతో ఈ రూట్‌లో ప్రయాణించే మాధవనగరం, చమ్మచింత, కురువాడ, ఆడాకుల తదితర గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

'లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపిన దోషులను కఠినంగా శిక్షించాలి'


పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

పాయకరావుపేట, సెప్టెంబరు 29: తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ డిమాండ్ చేశారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడారు. సనాతన హిందూ సాంప్రదాయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కఇరపై ఉందన్నారు. హిందువుల ఆరాధ్య దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రాచుర్యాన్ని తగ్గించేందుకు కొంతకాలంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. లడ్డూలో కల్తీ నెయ్యి కలిపిన వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిందన్నారు. త్వరితగతిన దోషులకు గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట విశ్వ హిందూ పరిషత్ ముఖ్య బాధ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలతో పాటు సామాజిక కార్యకర్త జీవీవీ సత్యనారాయణ, కంభంపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

1న డి.యర్రవరంలో నల్లకొండమ్మ జాతర



నాతవరం, సెప్టెంబరు 29: మండలంలోని డి. యర్రవరం గ్రామ ఆరాధ్య దైవం నల్లకొండమ్మ జాతరను అక్టోబరు 1వ తేదీన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతరను పురస్కరించుకుని 1వ తేదీ మధ్యాహ్నం డి యర్రవరంలో రాష్ట్ర స్థాయి గుర్రాల పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి గుర్రాల పోటీల విజేతలకు నగదు, షీల్డు అందజేస్తామని తెలిపారు. అలాగే జాతర రోజున వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

నేడు డిమాండ్స్ డే

- ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనను విజయవంతం చేయండి
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ దయామణి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న దయామణి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కార్మికులను పర్మినెంట్ చేయాలంటూ సోమవారం నిర్వహించనున్న డిమాండ్స్ డేను అంతా విజయవంతం చేయాలని ఏపీ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కె.దయామణి పిలుపునిచ్చారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. ఇటువంటి సమస్యలపై సోమవారం ఉదయం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, ప్రతినిధులు పెంటయ్య, తులసీ, సింహాచలం, నూరిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్, వుషూ క్రీడాకారుల ఎంపిక

పరవాడ, సెప్టెంబరు 29: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్, వుషూ క్రీడాకారుల ఎంపిక పోటీలను మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్ మైదానంలో సోమవారం ఉదయం నిర్వహించనున్నారు. అండర్-14, 17 బాలుర, బాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు జరిపి ప్రతి చూపినవారిని ఎంపిక చేస్తారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వి.దేముడు, ఎంపీ నాగేశ్వరరావు కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలి

▸ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు

నక్కపల్లి, సెప్టెంబరు 29 : టీడీపీ సభ్యత్వ నమోదు వచ్చే నెల రెండో తేదీ నుంచి ప్రారంభం కానుందని, నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. నక్కపల్లికి సమీపంలో హోంమంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద ఆదివారం సాయంత్రం నాలుగు మండలాల టీడీపీ నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదును లక్ష్యానికి మించి చేయాలన్నారు. ప్రస్తుతం టీడీపీ కార్యకర్తలకు రూ.రెండు లక్షల బీమాను రూ.ఐదు లక్షలకు పెంచారన్నారు. టెలిగ్రామ్, వాట్సాప్, గూగుల్ ద్వారా సభ్యత్వాల నమోదు చేసుకోవచ్చునని ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు బీమరశెట్టి శ్రీనివాస్ తెలిపారు. నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు



కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఎలమంచిలి, సెప్టెంబరు 29 : పట్టణంలోని వాగ్దేవి కళాశాల ఆవరణలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఎలమంచిలి బ్రాంచి ఇన్‌చార్జ్ నక్కా వెంకటరామన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టెస్టుకు క్రీడాకారులు ఉత్సాహంగా హాజరయ్యారు. సుమారు 40 మంది తమ ప్రతిభను ప్రదర్శించడంతో దీని ఆధారంగా బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. షావోకాన్ ఇండియా కరాటే డో అసోసియేషన్ ఏపీ చీఫ్ ఎగ్జామినర్ పి.నరసింహారావు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శివరామకృష్ణ పర్యవేక్షించారు. వాగ్దేవి కళాశాల ప్రతినిధి శేషగిరి దంపతులతో పాటు, దాడి రమేష్, పి.పృధ్వీరాజ్, రమేష్, శ్రీను, అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యం'



రైతు ఉత్పత్తులు జగదీష్‌కు బహూకరణ

కొత్తూరు, సెప్టెంబరు 29 : అనకాపల్లి పట్టణంలోని వీవీ రమణ రైతు భారతి భవనంలో జరుగుతున్న రైతు మేళాను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆదివారం సందర్శించారు. కేవలం ఆర్గానిక్ ఎరువులు ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తులను దళారీ వ్యవస్థకు తావు లేకుండా రైతులే విక్రయిస్తుండడం అభినందనీయమన్నారు. వీటిని ప్రజలు కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాల్సిందిగా ఆయన కోరారు. ఇటువంటి ఉత్పత్తులు వాడడం వల్ల ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా కేంద్రం అధ్యక్షులు రాపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?

▸ రాకపోకలకు హడలిపోతున్న వాహనదారులు ▸ వర్షాలకు నీరు చేరి మరింత అధ్వానం ▸ అసకపల్లి- లంకెలపాలెం రూటు మరీ దారుణం



అసకపల్లి సమీపంలో చెరువును తలపిస్తున్న లంకెలపాలెం రహదారి

సబ్బవరం, సెప్టెంబరు 29 : తాజాగా కురిసిన వరాలకు మండలంలోని పలు రహదారులు రూపు మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటి నిర్వహణను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ భారీగా గుంతలు పడ్డాయి. రెండు రోజుల క్రితం కురిసి వర్షాల నీరు అందులో చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో పలువురు వాహనదారులు గొయ్యి ఎక్కడో, రోడ్డు ఎక్కడో గుర్తించలేక చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. లంకెలపాలెం నుంచి సబ్బవరం వచ్చేవారు కొందరు వాహనదారులు అనకాపల్లి మీదగా వెళ్లే జాతీయ రహదారిని ఆశ్రయిస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణాలు చేయడం వల్ల తమ ఆటోలు, ద్విచక్ర వాహనాలు పాడవుతున్నాయని ఆయా యజమానులు వాపోతున్నారు. కొన్నిచోట్ల స్థానికులు స్పందించి మట్టి, రాళ్లు వంటి వాటిని వేసి గుంతలను పూడ్చుతున్నా ప్రయోజనం లేకపోతోంది. అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల వద్ద రోడ్ల దుస్థితి మరింత దారుణంగా ఉందని అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కనీసం మరమ్మతులైనా చేయించాలని అంతా కోరుతున్నారు.



పైడివాడ అగ్రహారం- పెదముషిడివాడ మధ్య...



కొనసాగుతున్న ఎమ్మెల్యే 'సుందరపు' దీక్ష



వెంకటేశ్వర ఆలయం వద్ద ప్రాయశ్చిత్త పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 29 : దేశంలో సనాతన ధర్మాన్ని కాపాడేందుకే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కంకణం కట్టుకున్నారని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండల కేంద్రం అచ్యుతాపురంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా ఆయన మూడో రోజు దీక్షను కొనసాగించారు. తిరుమల తిరుపతి దేవాలయ పవిత్రత కోసం వేదపండితులతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావుతో పాటుగా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ పాలకవర్గ సమావేశం

ఎలమంచిలి, సెప్టెంబరు 29 : ఇక్కడి మునిసిపల్ పాలకవర్గ సమావేశం సోమవారం ఉదయం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపట్టినట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించడంతో పాటు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి తీర్మానం



గడ్డి కోసే యంత్రం పనితీరు పరిశీలిస్తున్న సభ్యులు

కొత్తూరు, సెప్టెంబరు 29 : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరులో ఉన్న వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి, ఆధునికంగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం వాకర్స్ సమక్షంలో గడ్డి కటింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీప్రసన్న, వరహాలబాబు, వార్డు సభ్యులు హాజరై వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలనే అంశాలపై తీర్మానం చేశారు.

సీతారాం ఏచూరి సంతాప సభ రేపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : పట్టణంలోని పీటీడీ కాంప్లెక్స్ ఎదురుగా గల హోటల్‌లో మంగళవారం దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి సంతాప సభ జరగనుందని ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, వామపక్షాల నాయకులు హాజరు కానున్నారన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : జీవీఎంసీ 81వ వార్డు సాగిసుబ్బరాజు వీధికి చెందిన ఆడారి ధనలక్ష్మి కుటుంబ సభ్యులకు మంజూరైన ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ రూ.4.5 లక్షల చెక్కును ఆదివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, కర్రి బాబి, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

తులసీనగర్ పాఠశాలలో పూర్వ విద్యార్థినుల సందడి



విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినుల సత్కారంలో పూర్వ విద్యార్థినులు

ఎలమంచిలి, సెప్టెంబరు 29 : పట్టణంలోని తులసీనగర్‌లో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థినుల సందడి నెలకొంది. 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంబరపడ్డారు. నాలుగు దశాబ్దాల అనంతరం పాఠశాలలో మళ్లీ అడుగు పెట్టడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రస్తుత విశ్రాంత ఉపాధ్యాయినులు సావిత్రి, సరోజని, అరుణకుమారి, లక్ష్మీకాంతంలను ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు మంజువాణి, రాజేశ్వరి, మేరీ జ్యోతి, శ్రీదేవి, రాణి తదితరులంతా పాల్గొన్నారు

'అట్టడుగు వర్గాల బీసీలకు అందని ద్రాక్షలా రిజర్వేషన్లు'



చోడపల్లిలో సమావేశమైన యాతకులాల ఐక్యవేదిక నాయకులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 29 : బీసీ కులాల వర్గీకరణ జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యాత కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెంకె మారేష్ అన్నారు. మండలంలోని చోడపల్లిలో ఆదివారం మండల యాతకులాల ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా బీసీ రిజర్వేషన్లు అట్టడుగు వర్గాలకు అందని ద్రాక్షలా మారాయన్నారు. ముున్ముందు బీసీ వర్గీకరణ అంశంపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా వచ్చే నెల ఆరో తేదీన అచ్యుతాపురంలో 'కులం- వెనుకబాటుతనం' అంశంపై సదస్సు నిర్వహించనున్నామన్నారు. వెనుకబడిన తరగతులవారు పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాతకులాల సంఘం నాయకులు కర్రి రమణ, దుంగా వెంకట రమణ, యాండ్ర అప్పలనాయుడు, గుత్తుర్తి అప్పారావు, ఓడిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సు పాసుల్లో అన్యాయం

▸ ఏడాదిగా రాయితీ తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు

▸ కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి

▸ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ప్రతినిధి వీరుయాదవ్



దివ్యాంగులకు వీల్‌చైర్, ట్రైసైకిల్ పంపిణీ దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : గత ఏడాది కాలంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు పాసుల్లో రాయితీని తొలగించడం అన్యాయమని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ అన్నారు. స్థానిక ఉడ్‌పేటలో గల సంఘ కార్యాలయంలో ఆదివారం దాతల సహకారంతో పెద్ద మదీనాకు చెందిన కేశంశెట్టి ఈశ్వరరావుకు ట్రై సైకిల్, బయ్యవరానికి చెందిన కలగా రాములమ్మకు వీల్ చైర్ పంపిణీలో మాట్లాడారు. అనకాపల్లి నుంచి వైజాగ్ మెట్రో బస్సుల్లో దివ్యాంగులకు పాసులు అనుమతించకపోవడమే కాకుండా అనకాపల్లి జిల్లాలో ఇచ్చిన మెట్రో బస్సు పాసులు వైజాగ్‌లో చెల్లకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు, ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి జగదీష్, పార్థు వాటర్ సర్వీసింగ్ సెంటర్ అధినేత నామా చంద్రశేఖర్, సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పీలా'ను సత్కరించిన కశింకోట నేతలు



పీలా గోవిందకు పూలమాల వేసి సత్కరిస్తున్న నాయకులు

కశింకోట/అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణను కశింకోట తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. ఆదివారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయల మురళీ, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్, సత్తిబాబు, వేగి వెంకట్రావు, తాకాశి కృష్ణ, మళ్ల లోవకృష్ణ, పెంటకోట రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే, పీలా గోవిందను అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఘనంగా సత్కరించారు.

ఆర్డీవోను కలిసిన ఎంపీడీవో సీతారామరాజు



ఆర్డీవో రమణను కలిసిన సీతారామరాజు

నక్కపల్లి, సెప్టెంబరు 29 : నర్సీపట్నం ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వీవీవీ రమణను ఆదివారం నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రమణ గతంలో నక్కపల్లి తహసీల్దార్‌గా పనిచేశారు. ఆర్డీవోగా పదోన్నతి రావడంతో ఆయనను సత్కరించారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద గనిశెట్టి, తదితరుల నివాళి

పరవాడ, సెప్టెంబరు 29 : కమ్యూనిస్టు యోధుడు భగత్‌సింగ్ జయంతిని ఆదివారం లంకెలపాలెం బీసీ బాలుర వసతి గృహంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం చిరుప్రాయంలోనే ప్రాణత్యాగం చేసిన వీరుడు భగత్‌సింగ్‌గా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.ఉదయ్, వై.గోవిందరావు, ప్రసాద్, సంతోష్, సూర్య, రమణ, తేజ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న స్నేహితులు

సబ్బవరం, సెప్టెంబరు 29 : కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. సబ్బవరం హైస్కూల్‌లో 1999-20 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన బండారు రమణ ఈ నెల 16న క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఇతనికి భార్య ఐఐటీ చదువుతున్న కుమార్తె, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. పేదరికంలో ఉన్న వీరి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆ బ్యాచ్‌లో అతనితో పాటు చదువుకున్న వారంతా కలిసి రూ.42,500 నగదును పోగుచేసి రమణ కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరి ఔదార్యాన్ని చూసి గ్రామస్థులు ప్రశంసించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సబ్బవరం, సెప్టెంబరు 29 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన అండర్-19 విభాగంలో చెస్, క్యారమ్స్, మార్షల్ ఆర్ట్స్‌లో సబ్బవరం గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. దీంతో జె.అచ్చారావు, జి.కమాలకర్, జె.జగదీష్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. పీడీ సుధాకర్, సీఎల్ఎన్ ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు గుడివాడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపిక



జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 29 : స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో మండలంలోని గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర తెలిపారు. బాలుర విభాగంలో ఐదుగురు, బాలికల విభాగంలో ముగ్గురు నియోజకవర్గస్థాయి షటిల్ బాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించారన్నారు. దీంతో విద్యార్థులను ఉపాధ్యాయులు కుండూరు రాజు, భాస్కర్, మహేశ్వరి, సుధాలక్ష్మి, శ్రీదేవి, భవానీ తదితరులు అభినందించారు.

అసంపూర్తిగా హెల్త్ భవనాలు

» నిధుల సమస్యతో ఆగిన నిర్మాణాలు



పోలవరంలో అసంపూర్తిగా ఆగిన భవనం

గొలుగొండ, సెప్టెంబరు 29 : మండలంలో పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కమ్యూనిటీ హెల్త్ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 20 గ్రామ సచివాలయాల్లో గత ప్రభుత్వంలో ఒక్కో గ్రామ సచివాలయ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ భవన నిర్మాణానికి రూ.పది లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. పాతమల్లంపేట, జోగంపేట, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం గ్రామ సచివాలయంతో పాటు మరో నాలుగు గ్రామ సచివాలయాల్లో భవనాలనిర్మాణాలు పూర్తి చేశారు. కాగా, సుమారు 12 గ్రామ సచివాలయాల్లో నాలుగేళ్లుగా కమ్యూనిటీ హెల్త్ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇందుకు సకాలంలో అప్పటి ప్రభుత్వం బిల్లులు మంజూ రు చేయకపోవడమే కారణం. అందువల్లే నిర్మాణాలు పూర్తి చేయలేకపోయామని సంబంధిత కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ భవనాల నిర్మాణానికి చర్య లు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుండుపాలలో భవన పరిస్థితి..

తవ్వావారి వీధిలో కూలిన పురాతన భవనం



శిథిలాలు తొలగిస్తున్న దృశ్యం

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 29 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మునిసిపాలిటీ పరిధిలోని తవ్వావారి వీధిలో గోడలు నాని పోయి పురాతన భవనం ఆదివారం సాయంత్రం కూలిపోయింది. శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో చాలా కాలంగా ఎవరు నివాసం ఉండటం లేదు. దీంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగ లేదు. విశాఖపట్నంలో ఉంటున్న భవన యజమానికి మునిసిపల్ కమిషనర్ సురేంద్ర సమాచారం అందజేశారు. ఎక్స్‌కవేటర్‌తో శిథిలాలను తొలగించేకుందు చర్యలు తీసుకున్నారు.

పశువైద్యానికి నిర్లక్ష్యం సుస్తీ

» సక్రమంగా తెరచుకోని గునుపూడిలోని ఆస్పత్రి
» సిబ్బంది పనితీరుపై రైతుల అసంతృప్తి
» పట్టించుకోని అధికారులు

నాతవరం, సెప్టెంబరు 29 : నాతవరం మండలం గునుపూడి పశు వైద్య కేంద్రం సిబ్బంది పనితీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రిని సక్రమంగా తెరవడం లేదని, సిబ్బంది విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మన్యపురట్ల, పి.కె.గూడెం గ్రామ సచివాలయాల్లో పని చేసే పశువైద్య అసిస్టెంట్లు షిఫ్టుల వారీగా గునుపూడి పశువైద్య కేంద్రానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని అంటున్నారు. దీనివల్ల వీరు వారంలో రెండు, మూడు రోజులు పశువైద్య కేంద్రాన్ని తెరవడం లేదని పాడిరైతులు ఆరోపిస్తున్నారు. నెల రోజుల నుంచి గునుపూడి పశువైద్య కేంద్రానికి డాక్టరు రావటం లేదని గునుపూడి మాజీ సర్పంచ్ పోలుపర్తి చిట్టబ్బాయి తెలిపారు. అలాగే సిబ్బంది కూడా సరిగా పశువైద్య కేంద్రాన్ని తెరవడం లేదన్నారు. దీంతో పశువులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.



తాళం వేసి ఉన్న ఆస్పత్రి

డాక్టర్ సెలవులో ఉన్నారు : ఏడీ

ఈ విషయమై పాయకరావుపేట పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా.. గునుపూడి పశు వైద్యాధికారి నెల రోజుల నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నట్టు చెప్పారు. సిబ్బంది సక్రమంగా పశువైద్య కేంద్రాన్ని తెరవడం లేదన్న ఆరోపణలపై దృష్టి సారిస్తామన్నారు.

రూటుబోర్డులు ఏర్పాటు చేయరూ..

నాతవరం, సెప్టెంబరు 29 : మండల కేంద్రం నుంచి ఇటు సరుగుడు గ్రామానికి.. అటు గునుపూడికి వెళ్లే మార్గంలో రూటుబోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. సరుగుడు గ్రామంలో సరుగుడు జలపాతం ఉండడంతో పలు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అయితే నాతవరం నుంచి సరుగుడు వెళ్లే రహదారిలో రూటుబోర్డులు లేకపోవడంతో చాలామంది తికమక పడి గునుపూడి రూట్‌కు వెళ్ళిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్తగా తారురోడ్లు ఏర్పాటు చేసినప్పుడు ఆర్ అండ్ బీ అధికారులు నాతవరం దగ్గర మూడు రూట్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే కొన్నేళ్ల కిందట ఈ రూట్‌బోర్డులను నాతవరంతో పాటు చాలాచోట్ల గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. ఆ తర్వాత వీటి ఏర్పాటు గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రూటుబోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నాతవరం వద్ద రూట్ బోర్డులు లేని సరుగుడు వెళ్లే రహదారి

10 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 29 : గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేటలో పీహెచ్‌సీ వద్ద పది మద్యం క్వార్టర్ బాటిళ్లతో వ్యక్తిని పట్టుకున్నట్లు కృష్ణాదేవిపేట ఎస్ఐ టి.దివ్య తెలిపారు. చోద్యం గ్రామానికి చెందిన బోలెం సత్యనారాయణ పది మద్యం సీసాలతో పట్టుబడినట్టు చెప్పారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కృష్ణాదేవిపేటలో మోస్తరు వర్షం



కృష్ణాదేవిపేటలో పడుతున్న వర్షం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 29 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో ఆదివారం మోస్తరు వర్షం పడింది. దీంతో గత రెండు రోజులుగా ఎండ దెబ్బకు అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. వర్షంతో రైతులు సాగుపంటలకు ఎంతో మేలంటున్నారు.

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వచ్ఛతా హి సేవ

నర్సీపట్నం, సెప్టెంబరు 29 : పురపాలక సంఘం, వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మిని స్టేడియంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వాకర్స్ క్లబ్ సభ్యులు, వాలీబాల్, షటిల్ టీమ్ సభ్యులతో మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ప్రతిజ్ఞ చేయించారు. మెయిన్‌రోడ్డులో ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాలిథిన్ సంచులు వీడండి... వస్త్ర సంచులు వాడండి, మొక్కలు నాటండి... పర్యావరణాన్ని పరిరక్షించండి, మన చెత్త మన బాధ్యత అని నినాదాలు చేశారు. డివైడర్లపై ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం ఏరివేసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులు ఎంపీ రంగారావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బాబీ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, పీఆర్టీ యూ మండల శాఖ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ క్లబ్ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ జంపా సురేంద్ర

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సునీల్‌కుమార్

నర్సీపట్నం, సెప్టెంబరు 29 : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సునీల్‌కుమార్‌ని నియమిస్తూ ప్రొహిబిషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరిలో సెబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన విధుల్లోకి చేశారు. ఈ నెల 13న సెబ్ రద్దు చేసి ఎక్సైజ్‌లో విలీనం చేసిన తర్వాత సునీల్ కుమార్‌ని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయం

మాకవరపాలెం, సెప్టెంబరు 29 : మండలంలోని భీమబోయినపాలెంలో నిర్మించిన సచివాలయం భవనం వృథాగా పడి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.40 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. అయితే భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. ఈ భవనాన్ని ప్రారంభించకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న శెట్టిపాలెం సచివాలయానికి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాల్లోనే పాలనాపరమైన అన్ని పనులు నిర్వహిస్తున్నారని, కానీ భీమబోయినపాలెంలో నిర్మించిన భవనం ప్రారంభించకపోవడంతో దూరప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రజా సౌకర్యార్థం భవనాన్ని నిర్మించి నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడం అన్యాయమని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ సచివాలయ భవన ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొండలపాడులో విద్యుత్ లో-ఓల్టేజీ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 29 : మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సచివాలయం, పంచాయతీ పరిధి శివారు గిరిజన గ్రామమైన కొండలపాడులో లోఓల్టేజి సమస్య తీవ్రంగా ఉంది. ఈ సచివాలయానికి విద్యుత్ లైన్‌మన్ కూడా లేరు. ఈ పంచాయతీ పరిధిలో లోవ గవరవరం, కొండలపాడు గిరిజన గ్రామాలున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను సకాలంలో పునరుద్ధరించే పరిస్థితి ఉండడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ గ్రామంలో సుమారు 20 ఇళ్లు ఉంటాయి. లో ఓల్టేజీ సమస్యతో ఫ్యాన్లు, లైట్లు కూడా వెలగడం లేదని ఆయా కుటుంబాల వారు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చోడవరం నియోజకవర్గం

సీఎం సహాయనిధి పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, సెప్టెంబరు 29: మండలంలోని రాయపురాజుపేట పంచాయతీకి చెం దిన సాలాపు నరసింగరావుకు సీఎం సహాయనిధి నుంచి విడుదలైన రూ.1,15,400 లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్య క్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్సరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, రాయపురాజుపేట సర్పంచ్ రామునాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని గుండుబాడు పంచాయతీ బలిజిపాలెంనకు చెందిన నూకాలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు ఆదివారం స్థానిక నాయకులు శానాతి ఆదినారాయణ, పరిసం లోవరాజుల సమక్షంలో అందించారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్యఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సమస్యలపై సమష్టి పోరాటం'

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29: జర్నలిస్టుల సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర సంఘం నాయకుడు స్వామి అన్నారు. ఆయన ఆది వారం వడ్డాదిలో జరిగిన మాడుగుల ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం పాత్రికేయుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటపాడు జోగినాయుడు, కార్యదర్శి కోరాడ చంద్రరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ నగదు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శు లు ఐ.సత్యనారాయణ, రామారావు, జాతీయ కౌన్సిల్ స భ్యుడు శరగడం రామకోటి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అధికారి జగదీష్, ఉపాధ్యక్షుడు రబ్బ శీను, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.సత్యనారాయణ, రామారావు, మాడుగుల, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ మండలాల విలేకరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాలయంలో సహాయ అర్చకుడి నియామకం

చోడవరం, సెప్టెంబరు 29: పట్టణంలోని ప్రముఖ విఘ్నేశ్వరాలయానికి సహాయ అర్చకుడిగా సంగీశ కార్తీక్ విఘ్నేశ్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్తీక్ విఘ్నేశ్ తాత వెంకటరావు స్థానంలో అర్చకుడిగా అర్హత పొందిన కార్తీక్‌కు అవకాశం కల్పిస్తూ ఆలయంలో ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆలయంలో సహాయ అర్చకుడిగా పనిచేయాలని పేర్కొంది. ఈ మేరకు కార్తీక్ విఘ్నేశ్‌కు స్థానిక ఈవో ఎస్.వీ.వీ. సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు అందచేశారు.



కార్తీక్ విఘ్నేశ్‌కు నియామకపత్రం అందిస్తున్న ఈవో సత్యనారాయణ



చోడవరంలో అసంపూర్తిగా నిలిచిన రెవెన్యూ భవనం



చిన్న గదిలో నడుస్తున్న తహసీల్దార్ కార్యాలయం

పరాయి పంచన తహసీల్దార్ కార్యాలయం

» అసంపూర్తిగా భవన నిర్మాణం
» వెలుగు కార్యాలయంలో కొనసాగుతున్న వైనం » చోడవరంలో దుస్థితి

చోడవరం, సెప్టెంబరు 29: నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో సొంత భవనం ఉండేది. ఈ భవనాన్ని సుమారుగా 25ఏళ్ల క్రితం మావోయిస్టులు బాంబులతో దాడి చేసి పేల్చివేశారు. ఈ ధ్వంసమైన శిథిల భవనాల్లోనే చాలాకాలం తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతూ వచ్చింది. అయితే, దీని స్థానంలో కొత్త భవనాల కోసం 2016లో రూ. 50లక్షలు ఎంపీ ల్యాడ్ నిధులు మంజూరయ్యాయి. పాత భవనాలను కూల్చివేసి, కొత్తగా నిర్మాణం ప్రారంభించారు. ఈ స్థితిలో తాత్కాలికంగా అప్పటికే నిర్మాణం పూర్తయిన వెలుగుకు చెందిన స్త్రీశక్తి భవనంలోనికి తహసీల్దార్ కార్యాలయం మార్చుచేశారు. చిన్న గదిలో ఉండేలా ఏర్పాటు చేశారు. అయితే, మంజూరైన నిధులు చాలకపోవడంతో కొత్తగా ప్రారంభించిన భవనాల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కానీ ఈ రెవెన్యూ కార్యాలయం సంగతి పట్టించుకోలేదు. దీంతో అసంపూర్తి భవనం కాస్తా స్థానికులకు వాహనాల పార్కింగ్ షెడ్డుగా మారిపోయింది.

కలెక్టర్ పరిశీలన

కాగా, ఈ అసంపూర్తిగా తహసీల్దార్ నిర్మాణాలను శుక్రవారం చోడవరం పర్యటనకు వచ్చిన కలెక్టర్ విజయకృష్ణన్‌కు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు చూపించారు. నిర్మాణం పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్ భవనాలు త్వరలో పూర్తిచేస్తాం.
-ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయిన తహసీల్దార్ కార్యాలయం పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నాం. ఈ భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి, వెలుగు కార్యాలయంలో నడుస్తున్న కార్యాలయాన్ని ఖాళీ చేసి ఆ అధికారులకు అప్పగిస్తాం. ప్రస్తుతం వె లుగు కార్యాలయం నడుస్తున్న భవనంలో మహిళలకు అవసరమైన స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేదిశగా చర్యలు చేపడతాం.

దిబ్బపాలెంలో జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు

చీడికాడ, సెప్టెంబరు 29: మండలంలో దిబ్బపాలెంలో జిల్లాస్థాయి ఎడ్ల బండి పోటీలు జరిగాయి. వినాయక నిమజ్జనో త్సవంలో భాగంగా ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం వరకూ రానుపోను పరుగు పోటీకి కమిటీ నిర్ణయించింది. పోటీల్లో ప్రథమ స్థానం కె.జె.పురానికి రైతులు శ్రీఆంజనేయస్వామి ఎద్దులకు ప్రథమస్థానంరాగా, ద్వితీయ స్థానం శ్రీమరిడి మాంబ కూండ్రం, మూడవ స్థానం ముమ్మిన శివతేజ, 4వ స్థానం ముమ్మిన కనకరాజు నర్సయ్యపేట, ఐదో స్థానం నంబారు రామకృష్ణ ఎం.కొత్తపల్లి ఎద్దులకు దక్కాయి. విజేతలకు నగదు బహుమ తులను గ్రామ పెద్ద, మాజీ ఎం పీపీ దారపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎన్. రమణబాబు అందించారు. అలాగే, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి వి జేతలకు బహుమతులు అందించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ సమయంలో ఏర్పాటుచేసిన విజయనగరం కళాకారుల రేలా రేరేలా సాంస్కృతిక ప్రదర్శన అలరించింది.



పరుగుతీస్తున్న ఎడ్ల బండి

ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు

రావికమతం, సెప్టెంబరు 29: మండలంలో టి.అర్జాపురం గ్రామ సచివాలయానికి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సచివాలయానికి ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాం అనుసంధానం చేశారు. పదిరోజుల క్రితం కేబుల్ తెగిపోయింది. అప్పటినుంచి ఇంటర్నెట్ పనిచేయక ఈ సచివాలయంలో ప్రజలకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి.దీంతో ప్రజలు, విద్యార్థులకు కుల, ఆదాయ తదితర ధృవీకరణలు అందడంలేదు. రైతులకు అవసరమైన అడంగల్,1-బి,మ్యూటేషన్లు తదితర సేవలు నిలిచిపోయాయి. సర్పంచ్ ఫాల్గుణను సంప్రదించగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజలకు ఆర్థిక వ్యయంతోపాటు సమయం కూడ వృథా అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.



టి.అర్జాపురం గ్రామ సచివాలయం

జర్నలిస్టుల ఇళ్ల మంజూరుకు కృషి
రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29: అర్హులైన పాత్రికేయులకు హౌసింగ్ కాలనీ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆదివారం తాతయ్యబాబు రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు స్వామి, చంద్రరావు, జోగినాయుడు, రామకోటి, సత్యనారాయణ, వేణు, పోలిబాబు తదితరులు ఘనంగా సన్మానించారు. జర్నలిస్టులకు స్థలాలతోపాటు హౌసింగ్ ఇళ్ల మంజూరుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ తాతయ్యబాబుకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో రావికమతం, బుచ్చెయ్యపేట, మండలాల విలేకరులు పాల్గొన్నారు.



తాతయ్యబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న జనసేన నేతలు

జనసేన నేతల అభినందన

చోడవరం: రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా అధ్య క్షుడు బత్తుల తాతయ్యబాబును జనసేననియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం అభినందనలు తెలిపారు. గ్రామాలఅభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిపురపు రమేష్, అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు. కర్రి రమేష్, నరవ సరోజిని, తెలకపల్లి మహేష్, సీహెచ్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: బత్తుల తాతయ్యబాబును ఆదివారం మండల టీడీపీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. జానకీ రాంపురం నాయకులు లగుడు సత్తిబాబు, ఆదపురెడ్డి స్వామినాయుడు, శివ పాల్గొన్నారు.

రావికమతం: బత్తుల తాతయ్యబాబుకు దొండపూడి టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.ఈ మేరకు వడ్డాదిలో తాతయ్యబాబు స్వగృహంలో కలిసి వెదురుపర్తి వెంకటచారి, పాతలా చిరంజీవిరావు, గుమస్తా నాయుడు,పిల్లా నానాజీ,కోరతల రమేష్ తదితరులు కలిసి పుష్ప గుచ్ఛాలతో సత్కరించారు.

మాడుగుల రూరల్: బత్తుల తాతయ్యబాబుని ఆదివారం టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మరువాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు దళితనాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు బూసి వరహాల కోటి, రేఖా వెంకటరమణ, కొండలరావు తదితరులున్నారు.

మాడుగుల నియోజకవర్గం

గిరిజనులకు నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులు అందిస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి, సెప్టెంబరు 29: భగవాన్ సత్య సాయిబాబా సేవా సంస్థ ప్రతినిధులు వెంపల నగరు గల్లా. శంకరరావు ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీకి చెందిన మాకనాపల్లిలో 27 గిరిజన కుటుంబాలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు బియ్యంతోపాటు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. వేచలపు రామోనాయుడు, రంకిరెడ్డి వెంకటేశ్వర్లు, సూర రామారావు, లెక్కల.సత్యనారాయణ, వేచలపు వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, సెప్టెంబరు 29: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణ లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 6గంటలకు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొ క్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. కొందరు ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వినాయక అనుపోత్సవాలు

మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం వినాయక అనుపోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లపై వి గ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకువెళ్లారు. గ్రామ పురవీధుల్లో ఊరేగించిన అనంతరం మోదకొండమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించినపలు సాంస్కృతి కార్య క్రమాలు అలరించాయి.

వర్షంతో ఉపశమనం



చీడికాడలో కురుస్తున్న వర్షం

చీడికాడ, సెప్టెంబరు 29: చీడికాడ, కోనాం, శిరిజాం, మం చాల, ఖండివరం పంచాయతీల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో తీవ్ర ఇబ్బంది పడిన జనాలు సాయంత్రం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

మాడుగుల: మాడుగులతో పాటు మండల పరిధిలో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనాలు సాయంత్రం మబ్బులు కమ్మి చల్లని గాలులు వీచడంతో ఆనందం వ్యక్తంచేశారు.